ట్రంప్.. అమ్మో రికా!

పగ్గాలు చేపట్టగానే వలస విధానాలపై కఠిన ఆంక్షలు

విదేశీ విద్యార్థులు, ఉద్యోగులపై నిబంధనల పేరిట కత్తి

'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' కోసమేనని సమర్థింపులు

ఒత్తిడిలో లక్షల మంది భారతీయ విద్యార్థులు, ఉద్యోగులు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్ (నమస్తే తెలంగాణ): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వలస విధానాలపై తీసుకొంటున్న కఠిన నిర్ణయాలు భారతీయ విద్యార్థులు, ఉద్యోగుల్లో కలవరాన్ని సృష్టిస్తున్నాయి. 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' నినాదాన్ని చూపిస్తూ విదేశీయులపై ఆయన విధిస్తున్న ఆంక్షలు ఇండియన్ల 'డాలర్ డ్రీమ్స్'ను కల్లలుగా మారుస్తున్నాయి. జనవరి 20న అధికారంలోకి వచ్చింది మొదలు అక్రమ వలసలు, హెచ్1బీ, గ్రీన్‌కార్డు, జన్మతః పౌరసత్వ రద్దు, ఎఫ్1, ఓపీటీ.. ఇలా ప్రతీ అంశంలో ఆయన నిర్ణయం భారతీయులకు కునుకులేకుండా చేస్తున్నది.

క్లాస్ ఎగ్గొడితే వీసా రద్దు

అమెరికాలోని విద్యాసంస్థల్లో చదువుతున్న విదేశీ విద్యార్థులు కాలేజీ మానేసినా, విద్యా సంస్థకు చెప్పకుండా స్టడీ ప్రోగ్రామ్‌కు వెళ్లినా.. అదేపనిగా క్లాసులకు ఎగ్గొడుతూ హాజరుశాతం తక్కువగా ఉన్నా వారి వీసాలను రద్దు చేస్తామని ట్రంప్ సర్కారు ప్రకటించింది.

సెన్సార్ చేస్తే వీసా బ్యాన్

అమెరికన్ సోషల్‌మీడియా ప్లాట్‌ఫాంలపై పోస్టులు పెట్టే అమెరికన్లను సెన్సార్ చేసే విదేశీయులపై ట్రంప్ ప్రభుత్వం మరో కఠిన నిర్ణయం తీసుకొంది. అలాంటి వారికి ఎలాంటి వీసాలు జారీ చేయకుండా కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. చిన్న కారణాలతో ఎఫ్-1 వీసాలను రద్దు చేయడాన్ని ఇప్పటికే పలువురు న్యాయస్థానాల్లో సవాల్ చేశారు. హెచ్1బీ, ఎల్1 వీసాల ఆటో రెన్యువల్‌ను రద్దు చేయడంతోపాటు పరిమితిలో కోత విధించడానికి కూడా ట్రంప్ సర్కారు కసరత్తు ప్రారంభించింది.

జన్మతః పౌరసత్వం రద్దు

అమెరికాలో పుట్టినవారికి జన్మతః పౌరసత్వం లభిస్తుంది. అయితే, దీన్ని రద్దు చేస్తూ ట్రంప్ నిర్ణయం తీసుకొన్నారు. దీంతో హెచ్1బీ, స్టడీ వీసాలపై అమెరికాకు వెళ్లినవారు, గ్రీన్‌కార్డుల కోసం ఎదురుచూస్తున్న వారు కలవరానికి గురయ్యారు. ఫిబ్రవరి 20 నుంచి ఆదేశాలు అమల్లోకి వస్తాయని ప్రచారం జరగడంతో కొంతమంది గర్భిణీలు ఇంకా డేట్ ఉండగానే ముందస్తు ప్రసవాలకు సిద్ధపడ్డారు. ట్రంప్ నిర్ణయంపై కోర్టు కేసులు నడుస్తున్నాయి.

అక్రమ వలసలపై ఉక్కుపాదం

ట్రంప్ రెండోసారి పగ్గాలు చేపట్టిన అనంతరం అమెరికా వలస విధానాలను మరింత కఠినతరం చేశారు. ఎలాంటి పత్రాలు లేకుండా అక్రమంగా అమెరికాకు వలస వచ్చిన లక్షలాది మందిని ఆయన సొంత దేశాలకు సాగనంపారు. అమెరికాలో దాదాపు 1.10 కోట్ల మంది అక్రమ వలసదారులు ఉంటారని 2022లో గుర్తించారు. ఇందులో 7.25 లక్షల మంది భారతీయులు ఉన్నట్టు అంచనా. వీరిలో వేలాదిమందిని ఇప్పటికే ఇండియాకు విమానాల్లో తరలించారు. కాళ్లకు గొలుసులతో భారతీయులను బంధించి పంపించడం వివాదాస్పదమైంది కూడా.

డ్రంకెన్ డ్రైవింగ్‌లో దొరికినా..

ఏదో ఒక వంకతో విదేశీయులను వెనక్కి పంపించేందుకు ట్రంప్ సర్కారు వింత రూల్స్‌ను తీసుకొచ్చింది. విద్యార్థి లేదా వర్క్ వీసాపై ఉన్నవారు డ్రంకెన్ డ్రైవింగ్‌లో దొరికితే వారి వీసాను రద్దు చేశారు. మిన్నెసోటా యూనివర్సిటీలో ఇలాంటి ఘటనలే చోటుచేసుకొన్నాయి. ఇక, హమాస్, ఇతర ఉగ్రవాద సంస్థలకు మద్దతుగా ఎవరైనా సోషల్‌మీడియాలో పోస్ట్ చేస్తే వారి ఎఫ్1, ఎం1, జే1 వీసాలను రద్దు చేశారు. దీనికోసం ఏఐతో నిఘాను పెట్టారు. విదేశీ విద్యార్థుల సోషల్‌మీడియా ఖాతాల విశ్లేషణ కోసం కొత్త వీసా ఇంటర్వ్యూలను ట్రంప్ సర్కారు తాత్కాలికంగా నిలిపేయడం వివాదంగా మారింది.

టెక్ కంపెనీల హెచ్చరికలు

హెచ్1బీ వీసాదారులు అమెరికాను విడిచిపెట్టి వెళ్లొద్దంటూ మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్ వంటి ప్రఖ్యాత టెక్ కంపెనీలు సర్క్యులర్లు జారీ చేశాయి. స్వదేశానికి వెళ్తే అమెరికాకు తిరిగి రాలేరంటూ హెచ్చరికలు జారీ చేశాయి.

విద్యార్థులపై ఓపీటీ కత్తి

ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ) కింద అమెరికాలో ఉంటున్న విదేశీ విద్యార్థులకు ట్రంప్ సర్కారు మరో షాక్ ఇచ్చింది. స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌లో (ఎస్ఈవీఐఎస్) 15 రోజుల్లోగా ఉద్యోగ వివరాలను అప్‌డేట్ చేయాలని సూచించింది. లేదంటే స్వదేశానికి పంపించివేస్తామని హెచ్చరించింది. ట్రంప్ సర్కారు తాజా హెచ్చరికలతో 69 వేల మంది భారతీయ విద్యార్థులపై ప్రభావం పడనున్నది. కాగా ఓపీటీ రద్దుకు ట్రంప్ సర్కారు ఇప్పటికే ప్రయత్నాలు మొదలు పెట్టడం తెలిసిందే.

యూఎస్‌కి దారేదీ?

- స్టూడెంట్ వీసాల జారీ నిలిపివేసిన అగ్ర రాజ్యం
- ప్రభుత్వ వ్యతిరేక పోస్టులు పెట్టే వారిపై నిశితంగా నిఘా
- చట్ట విరుద్ధ పనులు చేసినా, వాటి గురించి చర్చించినా వీసా రద్దు, దేశ బహిష్కరణ
- దీంతో యూరప్ దేశాల్లోని చదువులపై మన విద్యార్థుల ఆరా
- అమెరికాకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టొద్దు
- ఆఫ్ క్యాంపస్‌లో పార్ట్ టైం ఉద్యోగాలు చేయకండి
- తెలుగు విద్యార్థులకు కన్సల్టెన్సీ సంస్థల కీలక సూచనలు

హైదరాబాద్ (నమస్తే తెలంగాణ): అమెరికాకు వెళ్లి చదువుకుని తమ డాలర్ డ్రీమ్స్‌ను నెరవేర్చుకోవాలని కలలు కంటున్న భారతీయ విద్యార్థులకు ట్రంప్ నిర్ణయాలు ఇబ్బందికరంగా మారాయి. అక్రమ వలసదారులపై అక్కడి అధికారులు ఉక్కుపాదం మోపుతుండగా ఎక్కడ పట్టుబడతామో అని ఇప్పటికే మన విద్యార్థులు చాలా మంది పార్ట్ టైమ్ జాబ్స్‌ను మానేశారు. ఇదిలా ఉంటే మరోవైపు స్టూడెంట్ వీసాల జారీని అమెరికా నిలిపివేసింది. ఇజ్రాయెల్-పాలస్తీనా యుద్ధంపై పలు వర్సిటీల్లో ఆందోళనలు, కొన్ని వర్సిటీల్లో ఉగ్రవాదానికి మద్దతుగా చర్యలు ఉన్నాయని అమెరికా భావిస్తున్నది. దీంతో విదేశీ విద్యార్థుల లింక్డ్ ఇన్ సహా ఇతర సోషల్ మీడియాల ప్లాట్‌ఫామ్‌ల ఖాతాలను అమెరికా అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్టూడెంట్ వీసాల జారీని అమెరికా తాత్కాలికంగా నిలిపివేసింది. వీసా కోసం దరఖాస్తు చేసిన విద్యార్థుల్లో ఎవరైనా తమ దేశానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టారా అనేది అధికారులు వెరిఫికేషన్ చేయనున్నారు.

కొత్త స్టూడెంట్ వీసా అప్లికేషన్‌లో మార్పులు

అమెరికాకు వ్యతిరేకంగా లేరని భావిస్తేనే విదేశీ విద్యార్థులను అమెరికాలో ఉండేందుకు అర్హత కల్పించనున్నారు. మరోవైపు తమ దేశంలో ఉండి చట్ట విరుద్ధ పనుల గురించి ఎవరైనా చాటింగ్ చేసి ఉంటే వారిపైనా అధికారులు చర్యలు తీసుకోనున్నారు. దీంతో భారత విద్యార్థుల్లో ఆందోళన నెలకొన్నది. అయితే కొత్త వీసా అప్లికేషన్‌లో మార్పులు చేసి త్వరలోనే వీసా ఇంటర్వ్యూలకు అమెరికా పిలవనున్నట్టు కన్సల్టెన్సీ వర్గాలు తెలిపాయి. అయితే మన దగ్గర వీసాలకు దరఖాస్తు చేసిన వాళ్లు తదుపరి ప్రకటన వెలువడే లోపు వీసా పత్రాల సమర్పణను పూర్తి చేయాలని వారు సూచిస్తున్నారు. అదే సమయంలో యూఎస్ స్టూడెంట్ వీసాపై మాత్రమే నమ్మకం పెట్టుకొని సమయం వృథా చేయొద్దని.. యూరప్ దేశాల్లో చదవులు, అక్కడి పరిస్థితులపై అధ్యయనం చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఏటా 40-50 వేల మంది విద్యార్థులు

ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి స్టడీ వీసా కోసం యూనివర్సిటీలను బట్టి రూ.35 లక్షల నుంచి రూ.కోటి వరకు ఖర్చు చేసి మన విద్యార్థులు అమెరికాలో చదువుకోవడానికి వెళ్తున్నారు. ఏటా 40-50 వేల మంది తెలుగు విద్యార్థులు అగ్ర రాజ్యానికి వెళ్తున్నారు. చదువుకునేటప్పుడు పార్ట్ టైం జాబ్ చేసుకునే వెసులుబాటు, చదువయ్యాక మూడేండ్ల వరకు పని చేసుకునే వీలు ఉండటంతో మన వాళ్లు అమెరికా వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే ట్రంప్ రెండోసారి అధ్యక్షుడయ్యాక పరిస్థితులు మారిపోయాయి. యూఎస్ వరుస ఆంక్షలతో మన విద్యార్థులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దీంతో వారు యూరప్‌లో విద్యాభ్యాసం గురించి ఆరా తీయడం మొదలుపెట్టారని కన్సల్టెన్సీలు తెలిపాయి.

రూల్స్ పాటిస్తే సమస్యలుండవు

స్టడీ వీసా మీద యూఎస్‌కు వెళ్లిన విదేశీ విద్యార్థులు ఆన్ క్యాంపస్‌లో మాత్రమే పనిచేయాల్సి ఉంటుంది. అంటే యూనివర్సిటీ పరిధిలో ఉండే లైబ్రేరియన్, సర్వింగ్, ప్రొఫెసర్ల వద్ద అసిస్టెంట్ ప్రొఫెసర్ వంటి ఉద్యోగాలు మాత్రమే చేయాలి. అలా కాదని ఆఫ్ క్యాంపస్(వర్సిటీకి అవతల)లో పని చేయడం అమెరికా చట్టాల ప్రకారం విరుద్ధం. అయితే మన వాళ్లలో చాలా మంది క్యాష్ ఇన్ హ్యాండ్ పద్ధతిలో క్యాంపస్ బయట పనిచేస్తున్నారు. వీరు పనిచేస్తూ కనిపిస్తే పోలీసులు దేశ బహిష్కరణ చేసి స్వదేశానికి పంపించేస్తున్నారు.

యూఎస్‌కు వ్యతిరేకంగా పోస్టులు పెటొద్దు

అమెరికాకు వెళ్లి చదివాలనుకునేవారు ఆ దేశానికి వ్యతిరేకంగా ఎలాంటి పోస్టులు పెట్టొద్దు. ప్లాన్-బీతో రెడీగా ఉండాలి. ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రెయినింగ్ (ఓపీటీ)తో భయపడాల్సిన అవసరం లేదు. యూనైటెడ్ స్టేట్స్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్(యూఎస్‌సీఐఎస్) వెబ్‌సైట్‌లో విద్యార్థులు తమ వివరాలను పారదర్శకంగా అప్‌డేట్ చేయాలి. పార్ట్‌టైమ్ జాబ్స్ చేయాలనుకునే వారు ఆఫ్ క్యాంపస్‌లో ఉద్యోగాలు చేయొద్దు. నిబంధనలు పాటిస్తే ఇబ్బందులు ఉండవు.

– శుభకర్ అలపాటి, గ్లోబల్ ట్రీ కన్సల్టెన్సీ ఫౌండర్ డైరెక్టర్

చట్టాలను ఉల్లంఘించొద్దు

అమెరికా చట్టాలను విదేశీ విద్యార్థులు తప్పనిసరిగా పాటించాలి. చట్టాలను ఉల్లంఘించే వారి పట్ల అక్కడి ప్రభుత్వం జీరో టాలరెన్స్(ఏమాత్రం ఉపేక్షించకుండా ఉండటం) విధానం అవలంబిస్తున్నది. చట్టాలను ఉల్లంఘిస్తే వీసా రద్దుతోపాటు దేశ బహిష్కరణకు అవకాశం ఉంది.

– హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్ అధికార వర్గాలు

డోజ్ నుంచి వైదొలిగిన మస్క్

వాషింగ్టన్: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ(డోజ్) చీఫ్ పదవి నుంచి వైదొలిగారు. 'డోజ్ చీఫ్‌గా నా పదవీ కాలం ముగిసింది' అని పేర్కొన్నారు. వృథా వ్యయాన్ని తగ్గించే అవకాశాన్ని తనకిచ్చినందుకు అధ్యక్షుడు ట్రంప్‌నకు ధన్యవాదాలు తెలిపారు. డోజ్ మిషన్ రానున్న కాలంలో ప్రభుత్వంలో ఓ జీవన విధానంగా మారుతుందని చెప్పారు. వ్యయ బిల్లుపై ట్రంప్ సంతకం చేశారని, ఇది డోజ్ చేసిన కృషికి విఘాతమని మస్క్ బుధవారం ట్రంప్‌పై మొదటిసారి విమర్శలు గుప్పించారు.

హార్వర్డ్‌కు 30 రోజుల ఉపశమనం

వాషింగ్టన్: విదేశీ విద్యార్థుల వీసాల విషయంలో హార్వర్డ్ విశ్వవిద్యాలయంతో వివాదంపై కోర్టు ఆదేశాలను జాప్యం చేయడం కోసం ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ ప్రయత్నిస్తున్నది. ఫెడరల్ కోర్టులో విచారణ ప్రారంభమవడానికి కొద్ది సేపటి ముందు ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ గురువారం హార్వర్డ్ వర్సిటీకి ఓ లేఖను పంపించారు. స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ప్రోగ్రామ్ కింద ఈ విశ్వవిద్యాలయానికి సర్టిఫికేషన్‌ను రద్దు చేయడాన్ని సవాల్ చేయడానికి 30 రోజుల గడువు ఇస్తున్నట్లు తెలిపారు.

చైనా విద్యార్థుల వీసాలు రద్దు!

త్వరలోనే ప్రారంభం: అమెరికా

వాషింగ్టన్: విదేశీ విద్యార్థులపై ఆంక్షలను ట్రంప్ నేతృత్వంలోని అమెరికా ప్రభుత్వం రోజురోజుకు తీవ్రం చేస్తున్నది. ఇందులో భాగంగా చైనా కమ్యూనిస్ట్ పార్టీతో సంబంధాలు ఉన్న వారు, క్లిష్టమైన రంగాల్లో విద్యనభ్యసిస్తున్న వారు సహా కొందరు చైనా విద్యార్థుల వీసాలను రద్దు చేసే కార్యక్రమాన్ని అమెరికా ప్రారంభిస్తుందని ఆ దేశ విదేశాంగ మంత్రి మార్కో రూబియో బుధవారం వెల్లడించారు. 'చైనా విద్యార్థుల వీసాలను మా ప్రభుత్వం దూకుడుగా రద్దు చేస్తుంది' అని ఆయన మంగళవారం ఎక్స్‌లో ప్రకటించారు.

చలికి గడ్డకట్టి గుజరాతీ ఫ్యామిలీ మృతి.. డర్టీ హ్యారీకి పదేండ్ల జైలు

న్యూఢిల్లీ: కెనడా నుంచి యూఎస్‌లోకి అక్రమంగా ప్రవేశించేందుకు ప్రయత్నిస్తూ చలికి గడ్డ కట్టి గుజరాత్‌కు చెందిన ఓ కుటుంబం మృతిచెందిన కేసులో ఇద్దరికి బుధవారం అమెరికా న్యాయస్థానం శిక్షను ఖరారుచేసింది. భారత్ నుంచి పలువురిని స్టూడెంట్ వీసాపై కెనడాకు రప్పించి, అక్కడి నుంచి అమెరికాకు అక్రమ మార్గంలో తరలిస్తున్న ఈ ముఠా గుట్టురట్టయ్యింది. ఈ కేసులో భారత్‌కు చెందిన స్మగ్లర్ 'డర్టీ హ్యారీ' అని పిలువబడే హర్ష కుమార్ రమణ్‌లాల్ పటేల్‌కు పదేండ్ల జైలు, ఆయన సహచరుడు ఫ్లోరిడాకు చెందిన స్టీవ్ ఆంటోనీ షాంద్‌కు ఆరేండ్ల శిక్షను ఖరారు చేస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది. 2021లో కెనడా నుంచి యూఎస్‌కు వెళ్తుండగా గుజరాత్‌కు చెందిన జగదీశ్ పటేల్(39), వైశాలి బెన్(30), విహంగి(11), ధార్మిక్(3) చలికి తాళలేక మృతిచెందారు.

అమెరికా నుంచి ఈ ఏడాది 1,100 మంది భారతీయుల బహిష్కరణ

న్యూఢిల్లీ, మే 29: ఈ ఏడాది జనవరి నుంచి 1100 మంది భారతీయులు అమెరికా నుంచి తిరిగి వచ్చారు లేదా ఆ దేశం నుంచి బహిష్కరణకు గురయ్యారని మన విదేశాంగ శాఖ గురువారం వెల్లడించింది. ఆ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ మీడియాతో మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడిగా డొనాల్ట్ ట్రంప్ బాధ్యతలు చేపట్టిన జనవరి నెల నుంచి ఇప్పటివరకు 1,080 మంది భారతీయులను బహిష్కరించారని చెప్పారు. వీరిలో 62 శాతం వాణిజ్య విమానాల ద్వారా తిరిగి వచ్చారన్నారు. అక్రమ వలసలకు సంబంధించి రెండు దేశాల మధ్య సన్నిహిత సహకారం కొనసాగుతున్నదని, అందుకే అక్రమ మార్గాల్లో అమెరికాలో ప్రవేశించిన వారిని మన దేశం వెనక్కి తీసుకుంటున్నదని ఆయన వివరించారు. ఇరాన్‌లో ముగ్గురు భారతీయులు అదృశ్యమైన విషయంపై ఆ దేశ అధికారులతో సంప్రదింపుల్లో ఉన్నామని ఆయన తెలిపారు.

డీల్స్ తప్ప.. డెలివరీల్లేవ్!

- ఆయుధ వ్యవస్థల సరఫరాలో అంతులేని జాప్యం జరుగుతోంది
- ఒక్క ప్రాజెక్టు కూడా సమయానికి పూర్తి కాలేదు
- హెచ్ఏఎల్‌తో 83 తేజస్ యుద్ధవిమానాలకు ఒప్పందం కుదుర్చుకుంటే ఇప్పటికీ ఒక్కటి కూడా అందలేదు
- సమయానికి ఇవ్వలేనప్పుడు ఒప్పందాలు ఎందుకు?
- రక్షణమంత్రి సమక్షంలో ఐఏఎఫ్ చీఫ్ సంచలన వ్యాఖ్యలు

సీఐఐ వార్షిక సదస్సులో పాల్గొన్న రాజ్‌నాథ్, నేవీ చీఫ్ త్రిపాఠి, అమర్‌ప్రీత్ సింగ్

న్యూఢిల్లీ, మే 29: రక్షణశాఖకు భారీగా బడ్జెట్ కేటాయిస్తున్నామని, బలోపేతం చేస్తున్నామని కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రచారానికి, వాస్తవానికి పూర్తి విరుద్ధంగా ఉన్నదని తేలిపోయింది. వాయుసేన అధిపతి, ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ తాజాగా చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఆయుధ వ్యవస్థలకు సంబంధించిన కాంట్రాక్టులపై సంతకాలు చేస్తున్నామే తప్ప, అవి తమకు చేరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయుధాల సరఫరాలో ఆలస్యం ఒక జాడ్యంగా మారిపోయిందన్నారు. ఏకంగా రక్షణ శాఖ మంత్రి సమక్షంలోనే అమర్ ప్రీత్ సింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి ఘటన దేశ చరిత్రలోనే మొదటిసారి అని రక్షణ రంగ నిపుణులు చెప్తున్నారు. అంతేకాదు ఆత్మనిర్భర్ భారత్ పేరుతో కేంద్రం చేస్తున్నదంతా హడావుడేనని తేలిపోయిందన్నారు.

ఇప్పటికీ ఒక్క తేజస్ కూడా అందలేదు..

గురువారం ఢిల్లీలో జరిగిన సీఐఐ వార్షిక సదస్సులో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాయుసేన అధిపతి మాట్లాడుతూ.. 'సమయానికి సరఫరా చేయడమనేది పెద్ద సమస్యగా మారింది. నాకు తెలిసి ఒక్క ప్రాజెక్టు కూడా అనుకున్న సమయానికి పూర్తి కాలేదు' అని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సమయానికి సరఫరా చేయలేనప్పుడు హామీ ఎందుకివ్వాలి? అని ప్రశ్నించారు. ముఖ్యంగా దేశీయంగా తయారయ్యే ప్రాజెక్టులు మరింత ఆలస్యం అవుతున్నాయని చెప్పారు. ఇందుకు లైట్ కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఎల్ఏటీ) ప్రోగ్రామ్‌ను ఉదాహరణగా పేర్కొన్నారు. తేజస్ ఎంకే-1ఏ యుద్ధ విమానాల తయారీకి హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)తో 2021లో రూ.48 వేల కోట్లకు ఒప్పందం చేసుకున్నామని చెప్పారు. 2024 మార్చి నుంచి విమానాలు డెలివరీ చేయాల్సి ఉన్నదన్నారు. 83 విమానాలకు ఆర్డర్ ఇస్తే ఇప్పటివరకు ఒక్కటి కూడా తమ చేతికి అందలేదన్నారు. తేజస్ ఎంకే-2 నమూనా ఇంకా సిద్ధం కాలేదన్నారు.

ఒప్పందం చేసుకుంటే కట్టుబడి ఉండాలి..

'దేశీయంగా ఉత్పత్తి గురించే కాదు, స్వదేశీ డిజైన్లపైనా చర్చ జరగాలి. భద్రతా బలగాలకు, ఆయుధ కంపెనీలకు మధ్య సమన్వయం ఉండాలి. ఒకసారి ఒప్పందం చేసుకుంటే దానికి కట్టుబడి ఉండాలి. సమయానికి డెలివరీ ఇవ్వాలి' అని ఏపీ సింగ్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం దేశంలో ఆయుధాల తయారీలో ప్రైవేట్ రంగ సంస్థలను కూడా భాగస్వాములు చేయడం గొప్ప విషయమన్నారు. తద్వారా భవిష్యత్తులో ఆయుధ తయారీ రంగం మరింత వేగం పుంజుకుంటుందన్నారు. అయితే.. ఆయుధ వ్యవస్థల సరఫరాపై ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ అసంతృప్తి వ్యక్తం చేయడం ఇదే మొదటిసారి కాదని నిపుణులు పేర్కొంటున్నారు. గతేడాది అక్టోబర్‌లో ఓ సందర్భంలో మాట్లాడుతూ.. టెక్నాలజీ విషయంలో ఒకప్పుడు మనం చైనా కన్నా ముందుండేవాళ్లమని, ఇప్పుడు వెనుకబడ్డామని వ్యాఖ్యానించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో సైతం హెచ్ఏఎల్ సంస్థపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

పాక్‌లో దర్జాగా కసూరీ!

- స్వేచ్ఛగా తిరుగుతున్న పహల్గాం సూత్రధారి
- పాకిస్థాన్‌లో అణు పరీక్షల వార్షికోత్సవ ర్యాలీ
- రాజకీయ నేతలతో వేదిక పంచుకున్న ఉగ్రవాదులు
- పహల్గాం ఉగ్రదాడితో ప్రపంచ వ్యాప్తంగా తన పేరు మార్మోగుతున్నదని సైఫుల్లా కసూరీ వ్యాఖ్య

న్యూఢిల్లీ, మే 29: ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్‌లోని ఉగ్రవాదుల పీచమణిచామని, పాకిస్థాన్‌ను కాళ్లబేరానికి వచ్చేలా చేశామని కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఊదరగొడుతుండగా, పహల్గాం ఉగ్రదాడి సూత్రధారులు మాత్రం పాకిస్థాన్‌లో రాజకీయ నాయకులను, ప్రభుత్వ అధికారులను వెంటపెట్టుకుని మరీ స్వేచ్ఛగా తిరుగుతున్నారు. పహల్గాం ఉగ్రదాడి ప్రధాన సూత్రధారి, లష్కరే తాయిబా కమాండర్ సైఫుల్లా కసూరీ దర్జాగా బహిరంగంగా తిరుగుతూ రాజకీయ వేదికలపై భారత వ్యతిరేక ఉపన్యాసాలు చేస్తున్నాడు. బుధవారం పంజాబ్ ప్రావిన్సులోని కసూర్ వద్ద పాకిస్థాన్ అణ్వస్త్ర పరీక్షల వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని యూమ్ ఇ తక్బీర్ పేరిట పాకిస్థాన్ మర్కజీ ముస్లిం లీగ్(పీఎంఎంఎల్) నిర్వహించిన ఓ బహిరంగ సభలో కసూరీ పాల్గొని భారత్‌పై విద్వేషాన్ని వెళ్లగక్కాడు. లష్కరే తాయిబా వ్యవస్థాపకుడు, హఫీజ్ సయీద్ కుమారుడు, ఉగ్రవాదిగా భారత్ ప్రకటించిన తల్హా సయీద్ కూడా ఈ ర్యాలీలో పాల్గొన్నాడు. పహల్గాం ఉగ్రదాడికి తాను సూత్రధారినని తనను భారత్ నిందిస్తున్నదని, యావత్ ప్రపంచంలో తన పేరు ఇప్పుడు మార్మోగుతున్నదని ర్యాలీలో మాట్లాడుతూ కసూరీ చెప్పాడు. భారత్ ప్రకటించిన ఉగ్రవాదుల జాబితాలో 32వ స్థానంలో ఉన్న తల్హా సయీద్ ఇదే ర్యాలీలో ప్రసంగిస్తూ జిహాదీ నినాదాలు చేశాడు. 2024 పాకిస్థాన్ సార్వత్రిక ఎన్నికల్లో పార్లమెంట్‌కు పోటీ చేసి సయీద్ ఓటమిపాలయ్యాడు. నిషిద్ధ లష్కరే తాయిబాకు రాజకీయ వేదికగా పీఎంఎంఎల్ ఉపయోగపడుతున్నది.

ట్రంప్ టారిఫ్‌లు చెల్లవు

అమెరికా ఫెడరల్ కోర్టు తీర్పు

దిగుమతి సుంకాలు విధించే అధికారం ట్రంప్‌కు లేదని స్పష్టీకరణ

వాషింగ్టన్: ఎమర్జెన్సీ అధికారాలను ఉపయోగించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దిగుమతులపై విధించిన టారిఫ్‌లను ఆ దేశ ఫెడరల్ కోర్టు అడ్డుకున్నది. ప్రతి దేశంపైనా విస్తృత సుంకాలను విధించే అధికారం ట్రంప్‌కు లేదని ఫెడరల్ కోర్టు గురువారం తీర్పు చెప్పింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ఆందోళనకు గురిచేయడమే కాకుండా దేశాల మధ్య వాణిజ్య యుద్ధానికి దారితీసిన సుంకాలను రద్దు చేసింది. ట్రంప్ తన అధికార పరిధిని దాటి దేశ వాణిజ్య విధానాన్ని తన ఇష్టాయిష్టాలకు అనుగుణంగా మార్చివేశారని ఆరోపిస్తూ భారీ సంఖ్యలో దాఖలైన కేసులపై విచారణ జరిపిన న్యూయార్క్‌లోని అమెరికా అంతర్జాతీయ వాణిజ్య కోర్టు ఈ మేరకు తీర్పునిచ్చింది. ఈ తీర్పుపై అప్పీల్ చేస్తామని ట్రంప్ సర్కారుకు చెందిన న్యాయవాదులు చెప్పారు. ప్రస్తుతానికి ట్రంప్ విధించిన దిగుమతి సుంకాల ముప్పు తొలగిపోయినట్టే. ఒకవేళ మళ్లీ దిగుమతి సుంకాలు విధించాలనుకుంటే.. ఈసారి ట్రంప్ చట్టసభల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. తాను విధించిన టారిఫ్‌ల వల్ల ఉత్పత్తిదారులు తమ పరిశ్రమలను అమెరికాకు తరలిస్తారని, దీంతో స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, ఫలితంగా ఆదాయం పెరిగి బడ్జెట్ లోటు తీరుతుందని ట్రంప్ పలుమార్లు ఉద్ఘాటించారు. ఒక రకంగా దిగుమతి సుంకాలను భారీగా పెంచడం ద్వారా ఆయా దేశాలను వాణిజ్యపరంగా లొంగదీసుకొని తనకు అనుకూలంగా ఒప్పందాలను కుదుర్చుకొనేందుకు ప్రయత్నించారు. కోర్టు తీర్పుపై వైట్‌హౌస్ ప్రతినిధి స్పందిస్తూ.. దేశంలో వాణిజ్యలోటు జాతీయ ఎమర్జెన్సీతో సమానమని అన్నారు. ఈ పరిస్థితి అమెరికన్ పౌరులను ధ్వంసం చేసిందని, తమ కార్మికులకు ఉపాధి లేకుండా చేసిందని, రక్షణ రంగ పరిశ్రమలకు ఆధారమైన వ్యవస్థ బలహీనపడిందని, ఈ అంశాలన్నింటితో కోర్టు విభేదించలేదని చెప్పారు. ఈ సంక్షోభాన్ని పరిష్కరించడానికి, అమెరికా ఔన్నత్యాన్ని పునరుద్ధరించడానికి పాలనా యంత్రాంగం అన్ని ప్రయత్నాలు చేస్తుందని స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లో ఎన్ఐఏ సోదాలు

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ) : విజయనగరం ఉగ్ర కుట్ర కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఏ దూకుడు పెంచింది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన తెలంగాణకు చెందిన సమీర్ సయ్యద్, విజయనగరానికి చెందిన సిరాజ్ ఇచ్చిన సమాచారం మేరకు సికింద్రాబాద్‌తో సహా నాలుగు చోట్ల ఎన్ఐఏ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలో సమీర్ ఇంట్లో సమావేశమైన కుర్రాళ్ల గురించి ఆరా తీసింది. నాలుగు చోట్ల జరిగిన సోదాల్లో పలు సాంకేతిక ఆధారాలను ఎన్ఐఏ అధికారులు కనుగొన్నట్లు తెలిసింది. కాగా తెలంగాణ ఇంటెలిజెన్స్ సిబ్బంది సైతం సమీర్‌తో సమావేశమైన వారి కోసం తీవ్రంగా గాలిస్తున్నది.

ఎన్ఐఏ అదుపులో యూట్యూబర్ బీఎస్‌వై?

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ): ప్రముఖ తెలుగు యూట్యూబర్ భయ్యా సన్నీ యాదవ్ (బీఎస్‌వై)ను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులు చెన్నై ఎయిర్‌పోర్టులో అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఇటీవల హైదరాబాద్ నుంచి పాకిస్థాన్‌లోని కరాచీకి సన్నీ యాదవ్ బైక్‌పై వెళ్లాడు.ఆపరేషన్ సిందూర్ తర్వాత అతను బైక్‌పై పాకిస్థాన్ వెళ్లడం కలకలం రేపింది. భయ్యా సన్నీ యాదవ్ పాకిస్థాన్‌కు ఏదైనా సమాచారం చేరవేసాడా అనే కోణంలో ఎన్ఐఏ అధికారులు విచారిస్తున్నట్లు తెలిసింది. కాగా, బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసిన కేసుల్లో యాదవ్‌పై సూర్యాపేట జిల్లాలో ఎఫ్ఐఆర్ కూడా నమోదైంది.

పాక్ గూఢచారిగా కాంగ్రెస్ నేత మాజీ సహాయకుడు!

జైసల్మేర్: రాజస్థాన్ కాంగ్రెస్ మాజీ మంత్రి షాలె మొహమ్మద్ మాజీ వ్యక్తిగత సహాయకుడు, ప్రభుత్వ ఉద్యోగి సకుర్ ఖాన్ మంగలియా పాక్ గూఢచారిగా పని చేస్తున్నట్టు అనుమానించి బుధవారం అతడిని అరెస్ట్ చేసి విచారణ చేస్తున్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో సకుర్ ఖాన్ జైసల్మేర్ జిల్లా పరిపాలన కంట్రోల్ రూమ్‌లో పని చేశాడని పోలీసులు తెలిపారు. అతడికి పాక్ ఎంబసీలోని ఓ అధికారికి సంబంధాలున్నాయని ఆరోపించారు. ఖాన్ ఫోన్‌లో పాకిస్థాన్‌కు చెందిన పలు గుర్తు తెలియని ఫోన్ నెంబర్లున్నట్టు పోలీసులు గుర్తించారు. అతడు ఆరేడు సార్లు పాకిస్థాన్‌కు వెళ్లి వచ్చినట్టు అంగీకరించాడని జిల్లా ఎస్పీ వెల్లడించారు.

హనీట్రాప్‌లో జూనియర్ ఇంజినీర్

ముంబై, మే 29: హనీ ట్రాప్‌లో చిక్కుకుని సున్నితమైన దేశ సమాచారాన్ని పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ ఏజెంట్‌కు అందజేస్తున్నాడన్న ఆరోపణపై థాణెకు చెందిన ఒక జూనియర్ ఇంజినీర్‌ను మహారాష్ట్ర యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) బుధవారం అరెస్ట్ చేసింది. థాణెకు సమీపంలోని కల్వాలో నివసిస్తున్న 27 ఏండ్ల రవీంద్ర మురళీధర్ వర్మ డిఫెన్స్ టెక్నాలజీ సంస్థలో జూనియర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. పాకిస్థాన్‌కు చెందిన ఏజెంట్ ఒకరు తనను ఫేస్‌బుక్‌లో మహిళగా పరిచయం చేసుకుని హనీట్రాప్‌లో పడేశాడు. దీంతో వర్మ గత ఏడాది మార్చి నుంచి దేశ రహస్యాలను వాట్సాప్ ద్వారా పాకిస్థాన్ ఏజెంట్‌కు పంపుతున్నాడు.

బ్రహ్మోస్‌తో మా సైనిక స్థావరాలు ధ్వంసం: షరీఫ్

న్యూఢిల్లీ, మే 29: భారత్‌పై తాము దాడులు జరపాలని నిర్ణయించుకున్న తర్వాత రాత్రికి రాత్రే తమ వైమానిక స్థావరాలపై భారత్ సాయుధ దళాలు దాడులు జరిపాయని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఒప్పుకున్నారు. మే 9-10వ తేదీ మధ్య రాత్రి రావల్పిండిలోని విమానాశ్రయంతోసహా ముఖ్యమైన వైమానిక స్థావరాలపై భారత్‌కు చెందిన బ్రహ్మోస్ క్షిపణులు విరుచుకుపడి విధ్వంసం సృష్టించాయని షరీఫ్ వెల్లడించారు. 10వ తేదీ తెల్లవారుజామున ప్రార్థనల తర్వాత 4.30 గంటలకు భారత్‌పై దాడి చేయాలని సైన్యం నిర్ణయించిందని, అయితే తెల్లారకముందే బ్రహ్మోస్ క్రూయిజ్ క్షిపణులు దాడి చేశాయని ఆయన వెల్లడించారు.